# పలికించెడివాడు

డాక్టర్ సుప్రసన్న

"నాయనా! నీవేనా లక్కసానమ్మ కొడుకువు? గుర్తు పట్టనే లేదు. చిన్నప్పుడు చూచిన" అంటూ నెత్తిన ఉన్న పాలకుండను దించి కూర్చున్నది ఆ వృద్ధురాలు. ఆమె వయసు సుమారు అరవయ్యేళ్ళు ఉంటుంది. ముఖాన ఎఱ్ఱ కుంకుమ — ఒంటి నిండా గొల్లవాళ్ళు ధరించే సర్వాభరణాలు—శరీరం పసిమి తగ్గలేదు. ముఖం నిండా కళ. త్రయోదశి వెన్నెలలు ఆమె ముక్కు పోగు మీద ప్రతిఫలించి నుదుట చంద్రకళను తీర్చి దిద్దుతున్నది.

మూడు ం జులలో రాబోయే చంద్రగ్రహణానికి ధర్మపురి క్షేత్రంలో గోదావరి గంగ స్నానం చేయడానికి బంధుమిత్రులతో ప్రయాణం చేస్తూ ఆ రాత్రి యెలిగందుల దగ్గర చెరువు దగ్గర ఆగిన బమ్మెర పోతరాజుకు ఆమెను చూడగానే ఎవరో చిరపరిచితురాలిని చూచినట్లనిపించింది. ఎవరో ఈ 'గోపాలసుందరి' అని మనస్సులో అనిపించినా, తనను వాత్సల్యంతో పెంచిన అవ్వ గుర్తుకు వచ్చింది ఆయనకు.

"ఈ పాలు మా కోసం తెచ్చావా, తల్లీ" అన్నాడు పోతరాజు.

"అవును, నాయనా? ఒరంగల్లు నించి ఎవరో కవీశ్వరుడు వస్తున్నాడని విన్నా. ఇక్కడకు రాగానే తెలిసింది నీవు బమ్మెర లక్కసానమ్మ బిడ్డవని. ఆమె నీ చిన్నతనంలో ఈ యెలిగందుల మఠానికి వచ్చింది. ఇక్కడ సాధువుల దర్శనం చేసి వెళ్ళింది. ఆనాడు చూసిన నిన్ను. ఈనాడు నీవు బలరాముని వలె ఉన్నవు. ఈ పాలు నీవూ, నీవాళ్ళూ తాగండి. నాకు తృప్తిగా ఉంటుంది." అప్పుడే పితికి తెచ్చిన ఆ పాలు చంద్రమండలంలో నుండి జారిన వెన్నెల ధారలలాగా కన్పించినాయి.



"అవ్వా! నీవు మా అమ్మవంటి దానివి. ఆ అమ్మ నాకు తెలిసిన దైవం. ఆమె పెదవుల కదలికలో నుంచే నేను శివ పంచాక్షరి ఉపదేశం పొందినవాణ్ణి. మా నాన్న కేసన్న నాకు రామమంత్రోపదేశం చేశారు. ఆ మంత్రాలు వాళ్ళు ఎన్ని కోట్లు చేశారో! ఆ పుణ్యలేశం వల్లనే నేను ఇలా ఉన్నాను!"

"తండ్రీ! పోయి వస్తా. మనుమరాలేదీ?"

బమ్మెర పోతరాజు దూరాన ఉన్న తన భార్య బాలరుక్మిణిని పిలిచి ఆమెకు చూపించాడు. ఆ వృద్ధురాలి కళ్ళలోని దయా మధురరేఖలు ఆమెకు అభిషేకం చేశాయి. వాళ్ళిద్దరూ మాట్లాడుతూ ఉండగా, పోతరాజు చెరువులో స్నానం చేయడానికి వెళ్ళాడు. స్నానం చేస్తున్న పోతరాజుకు బాలరుక్మిణి ముఖం నిండా కళ్ళతో అరుణ వర్ణంతో బాలా త్రిపుర సుందరిలా కానవచ్చింది. తన వూహకు తానే నవ్వుకున్నాడు పోతరాజు.

పోతరాజు మెుందటి రోజు ఉదయం ఒరంగల్లు నుంచి బయలుదేరాడు. ఎందుకో కొన్ని రోజులుగా మనస్సులో ఏదో తపన. ఏకాంతంలో ఒక సన్నని కరుణ భావం సాక్షాత్కరించేది. ఈ ముప్పయ్యేళ్ళ వయస్సులోనే ఒరంగల్లు ఎన్నోసార్లు యుద్ధాలకు ఆలవాలమై ఎన్నోసార్లు మూలమట్టం చేయబడ్డది. అయినా ప్రజలున్న చేవవల్ల ఎప్పటికప్పుడు కోలుకుంటున్నారు. అయినా ఒక నిస్పృహ

## కవితా తపస్సు

"ఒనరన్ నన్నయ తిక్కన నాది
  కవుల్ యుర్విన్ బురాణా వలిన్
దెనుగున్ జేయుచు మత్పురా
  కృత శుభాధిక్యంబు తానెట్టిదో
తెనుగున్ జేయరు మున్ను
  భాగవతమున్ దీనిం దెనింగించి మ
జ్జననంబున్ సఫలంబు జేసెద
  పునర్జన్మంబు లేకుండగన్."

తాండవిస్తున్నది. ఎవరికి వారే భయంతో కుంచించుకు పోతున్నారు. సమాజం ఈ గిరి గీతల్లో ఛిన్నా భిన్నం అయ్యేట్లు ఉన్నది. ఈ సమాజంలో ఉన్న దుఃఖం అంతా తనలోనే ప్రతిఫలిస్తున్నది. అందరి దుఃఖం తనది. రాజాస్థానాలలో కవులవలె ఏవో కొన్ని రచనలు చేయటమా? లేక సమాజంలో ఒక విశ్వాసం కలిగించే రచన చేయుటమా? తాను నిశ్చయించుకోలేకపోతున్నాడు. భాగవతంలో గజేంద్రుని స్థితి తనది.

ఈ స్థితిలోనే భాగవతం మొత్తం తెలుగులో చెప్పవలెనని తోచింది. శ్రీకృష్ణుని సుదర్శనచక్రం ఒకవైపు, వేణుగానం రెండోవైపు స్వప్నాలలో సాక్షాత్కరించేవి కొన్ని నెలలుగా. పోతరాజు మన స్సులో భాగవతం తెలుగు చేద్దామని కలిగిన సంకల్పం విన్న గురువులు, బంధువులు 'బాగుంది—ఈ ప్రయత్నం కొనసాగించ'మన్నారు. తండ్రి కేసన్న 'ఈ మహా ప్రయత్నం చేసే ముందు మన 'ఇలవేలుపు' ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనం చేసి, అటునుంచి వేములవాడ రాజరాజేశ్వరుణ్ణి దర్శించుకొని ర'మ్మన్నాడు. పోతరాజు నాలుగు రోజుల ప్రయాణం పెట్టుకుని బయలుదేరాడు.

పోతరాజు స్నానం చేసి వచ్చి, సంధ్య వార్చి జపం ముందు కూర్చున్నాడు. మిగతావాళ్ళు భోజనాలు పూర్తయ్యేసరికి ఆయన జపం పూర్తిచేసి కాసిన్ని పాలు తాగాడు. ఆ వృద్ధురాలు పోతరాజును చల్లంగ బలికమని దీవించి వెళ్ళిపోయింది.

మళ్ళీ రాత్రి పది గడియల తరవాత బండ్లు సాగిపోతున్నవి. బాల రుక్మిణి 'బావగారు, అక్కయ్య కూడా మనతో వస్తే బావుండేది' అన్నది. పోతన్న మనస్సులో ఇటీవల అన్నయ్య క్రమంగా దైవనిష్టలో ఎక్కువగా చేరిపోవడం, శివేతర దైవతారాధనకు అంతగా ఇష్టపడక పోవడం స్ఫురించింది. అద్వైతనిష్ఠగల తన కుటుంబంలో ఈ ఉపాసనా విషయకమైన పరిమితులు రావడం విచిత్ర ఘటనగా తోచింది. లింగధారణ చేయలేదు. కాని అన్నయ్య దాదాపు జంగముల వలెనే



ప్రవర్తిస్తున్నాడు. తాను మాత్రం చిన్నతనంలో పాల్కురికి సోమన బసవపురాణం ఎంతో ఇష్టంగా పాడుకోలేదా? ఈ నాటికీ ఆ రచన వింటే ఎంతగా తాను పారవశ్యం పొందుతాడు! చిన్ననాడు బమ్మెరలో ఉన్నప్పుడు చెరువు కట్టదాటి పాల్కురికి కొండమీద సోమేశ్వరస్వామిని, లక్ష్మీ నరసింహ స్వామిని ఎంతగా పూజించేవాడు! తిప్పన్నలో ఈ మార్పు రావడం, తమ కుటుంబం అంతా ఒరంగల్లు వచ్చినా ఆయన బమ్మెరలోనే ఉండటం ఆయన కళ్ళముందు కదలాడింది.

బాలరుక్మిణి ప్రశ్నకు పోతరాజు సమాధానం చెప్పనేలేదు. క్రమంగా ఆమె నిద్రలోకి జారుకున్నది. అన్ని బళ్ళలోనూ అందరూ నిద్రపోతున్నారు, బండి తోలే వాళ్ళు, పోతరాజు తప్ప.

భాగవతం వ్రాసే ముందు వ్యాసుని మనస్సులోని వ్యథ గుర్తు వచ్చింది. ఆకాశంలో చందమామ ఒక్కడే కనవస్తున్నాడు. నిర్మేఘమైన ఆకాశంలో చంద్రకిరణాలు మహతీ తంత్రులవలె కనవస్తున్నవి. దూరాన ఎక్కడో ఒక తుమ్మెద ఝుంకారం చేస్తున్న ధ్వని వినవస్తున్నది. చంద్రబింబం తనకు నారదునివలె స్ఫురించింది.

ఆ స్ఫురణతోనే పోతరాజు ఒక వ్యక్తావ్యక్త స్థితిలోకి వెళ్ళిపోయాడు. అతని చుట్టూ శబ్దమయమైన ఒక నూతన ప్రపంచం మేల్కొన్నది. తాను బృందావనంలో ఉన్నట్లు, ఎవరికోసమో వెదుకుతున్నట్లు పశువులను, పక్షులను, పాములను, పుట్టలను, చెట్లను, చేమలను అడుగుతున్నాడు. నల్లనివాడు పద్మనయనంబులవాడు, కృపారసంబు పై చల్లెడు వాడు మౌళిపరిసర్పిత పింఛమువాడు, నవ్వు రాజిల్లెడు మోమువాడొకడు — అతనికోసం అన్వేషణ. సర్వప్రకృతి ఈశ్వర చైతన్యంతో పొంగిపోతున్నది. సర్వ జగత్తు ఈశ్వర విరహంతో వేగిపోతున్నది.

తాను ప్రకృతికి, ఎంతో దూరాన ఉన్న నీలాకాశానికి అనుబంధం కల్పించబోతున్నాడు. తాను అగ్నిద్యోతనుడు —

తాను రుక్మి, తాను బలి, తానే హిరణ్యకశిపుడు— ఎక్కడో ఈ తామస ప్రవృత్తిలో కూడా అట్టడుగున దివ్య చైతన్యం మేల్కొంటూ ఉన్నది. భగవంతుని తాను నిరసిస్తూ ఉన్నా తన మాటల్లో తెలియకుండానే ఈశ్వరభక్తి వ్యక్తమవుతూన్నది.

తాను భీష్ముడు, తానే కుంతి, తానే గజేంద్రుడు, తానే ప్రహ్లాదుడు.

పోతన మనస్సులో భాగవత కథా చక్రమంతా పరిభ్రమిస్తున్నది. అన్ని దృశ్యాలలోనూ, అన్ని పాత్రలలోనూ తానే కనవస్తున్నాడు. తానే వెదుక్కుంటున్నాడు. మాటలు పెగలడం లేదు. తాను వెదికే వస్తువేమిటో తనకు తెలుసు. అయినా మాటల్లో రూపు కట్టించలేకున్నాడు. ఈ ఊహాపరంపర సాగుతూ ఉండగానే తెల్లవారింది.

ఉదయిస్తున్న సూర్యబింబం పోతనకు భగవంతునికి పట్టిన ఛత్రంలాగా, ఆయన శిరోమణిలాగా, కర్ణాభరణంలాగా, మెడలో రత్నంలాగా అనిపించింది.

• • •

ఆరోజు ప్రయాణం సాగింది జాము పొద్దెక్కేదాకా. ఎండ ఎక్కువైంది. తమ బృందం ధర్మపురి చేరడానికి ఇంకా మూడామడ ఉంది. ఆ మధ్యాహ్నం దారిలో ఒక గ్రామంలో విడిది చేసిన పోతన్న అక్కడ ఒక యతిని చూశాడు. ఆ యతి తెల్లని జడలతో, గడ్డంతో ఉన్నాడు. ఆజానుబాహువు— ఆయన ఉత్తరదేశం నుంచి వస్తూ ఉన్నాడు. మౌన వ్రతములో ఉన్నాడు. పోతరాజును చూడగానే ఆయన వాత్సల్యంతో తల నిమిరి, వీపుమీద చేయి వేసి ఆశీర్వదించాడు. ఆయన స్పర్శతో తనలో ఏదో నూతనమైన సంచలనం కలిగినట్లు తోచింది.

పోతన్న ఆ యతి దగ్గర సెలవు తీసుకున్నాడు. తన శరీరంలో కణకణమూ ఒక అపూర్వమైన సంచలనం పొందుతున్నది. మనస్సు తీవ్రావేశానికి లోనవుతున్నది. మధ్యాహ్నం విశ్రమించి సాయంకాలం మళ్ళీ బయలుదేరారు. బండిలో కూర్చున్న పోతన్న వివశుడై ఉన్నాడు. అవయవాలన్నీ తన స్వాధీనంలో లేవు. బాల రుక్మిణి ఆయన స్థితిని చూచి ఆందోళన పడ్డది. 'తల్లీ, లలితా! నీవే రక్షించాలి' అనుకున్నది. పోతన్న నిద్రపోతున్నాడు.


**60 రోజుల్లో ఇంగ్లీషు భాష**

రచన : డి.వి.ఎస్.ఆర్. మూర్తి

**(386 పేజీలు వారపత్రికల సైజు)**

**వెల : రు. 21-00**


(త్వరగా, సులభంగా, ఇంగ్లీషు మాట్లాడడం, వ్రాయడం నేర్పే పుస్తకం)

అన్ని షాపులలోనూ దొరుకుతుంది. లేదా 20 రూపాయలు **M.O.** చేయండి. రూపాయికి **V.P.P.** పంపుతాము.

క్వాలిటీ పబ్లిషర్స్,

రామమందిరం వీధి, విజయవాడ-2.

సరిక్రొత్త శక్తి యవ్వనమునకు సంప్రదించండి



నరముల బలహీనత, సుఖ రోగములు, చర్మ వ్యాధులు, మొలలు, సెక్స్ బలహీనతలకు ఉత్తమ చికిత్స చేయబడును. సంపూర్ణ ఆరోగ్యము సుఖ దాంపత్య జీవితమునకు పెండ్లి ముందు పెండ్లి తర్వాత సంప్రదించండి.

**Dr. Z. H. ROY (Govt. Regd.)**

**Dr. K. KESAVA RAO**
**(Ayurveda Praveena)**

ఆసియా క్లినిక్

సంధ్యటాకీసు ఎదుట, R.T.C. X ROADS

హైద్రాబాద్-500 020 (ఆం. ప్ర.)

ఆ నిద్ర ఎంత గాఢమైంది అంటే ధర్మపురికి చేరిన పూర్ణిమనాటి ఉష్ణకాలంలోనే ఆయన మామూలుగా మేల్కొన్నాడు.

రాత్రంతా బాల రుక్మిణి భర్త పక్కనే మేల్కొని ఉన్నది. సహజంగా పోతరాజు పది గడియలకు మించి నిద్రపోడు. ఆ రోజు ఆయన స్థితి అసాధారణమైంది. అటు ఉషస్సు ఉదయించడం, ఇటు పోతన్న మేల్కొనడం ఆమెకు ఒక తపస్సిద్ధి లాగా అయింది.

ఉదయం అందరూ గోదావరిలో స్నానం చేశారు. పోతరాజు పన్నెండు గడియల వరకూ జపం పూర్తి చేసి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరాడు. ఆయనకు స్వామి హిరణ్యకశిపుని సభలో స్తంభం నుండి అప్పుడే ప్రత్యక్షమైనట్లు తోచింది.

ఆర్తత్రాణ పరాయణుడైన స్వామిని చూడగానే పోతరాజు కంఠంలో నుంచి పద్యాలు పరంపరగా వెలువడుతూ ఉన్నవి. ఇంత కాలం తనపద్యంలో తనకు స్ఫురించని ఏదో నిసూతనమైన లక్షణం కొత్తగా చేరినట్లు అనిపించింది. తన పద్యభావంలో తానే తాదాత్మ్యం పొందటం అది.

ఆ రోజు బాల రుక్మిణి స్వామి క్షీరాభిషేకం చేయించింది. ఆమె గొంతులో శ్రీ శంకరుల కరావలంబస్తోత్రం ప్రతిధ్వనించింది. స్వామి వక్షంమీద నుంచి పాలు జారుతున్నప్పుడు ఆమెకు తాము యొలిగందులలో చూచిన అవ్వ గుర్తుకు వచ్చింది. స్వామి ఉగ్రతను వీడి ప్రసన్నుడైనట్లుగా ముఖం నిండా స్మితరేఖలు ప్రకాశించినవి.

పోతరాజు మధ్యాహ్నం ఆ ఊళ్ళో ఒక వృద్ధుడైన విద్వాంసుని ఇంటికి వెళ్ళాడు. ఆయన పేరు రాజన్న శాస్త్రి. దాదాపు ఎనభయ్యేళ్ళ వయస్సు ఉంటుంది. పొద్దున్న గోదావరిలో స్నానం చేసి కూచుంటే సాయంత్రం దాకా భాగవతం ముందు పెట్టుకుని వ్యాఖ్యానిస్తూ ఉంటాడు. ఆయనకు శ్రోతలు ఉన్నారా లేదా అనే ఆలోచన లేదు. ఆయన లోకం ఆయనదే. సంసార విషయాలు అసలే పట్టవు. వేళకెవరో పిడికె డన్నం పెడితే చాలు.

రాజన్నశాస్త్రికి తనది ప్రత్యేకమైన లోకం. అది భాగవత లోకం. లోకం దృష్టిలో ఆయన పిచ్చివాడే. ఆయన ప్రవచనం చేస్తూ ఉంటే అనేక శాస్త్రాంశాలు, వేదాంత రహస్యాలు వెల్లడి అవుతవి.

పోతరాజుకు ఆ ఇంటి ముందరి వసారాలో కూర్చున్న రాజన్న శాస్త్రిని చూడగానే వ్యాసమహర్షి లాగా అనిపించింది. ఆ రోజు శాస్త్రి ప్రవచనం శ్రీకృష్ణ జననం. భాగవతారంభంలో చెప్పిన "సత్యం పరందీమహి" అన్న సత్య రూపమైన తత్త్వానికి, సత్యస్య సత్యం, సత్యస్య యోనిక, సత్యాత్మకం అన్న శ్రీకృష్ణునికి ఆయన సమన్వయం చేసి చెబుతున్నారు. ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు, భగవద్గీత అన్నింటి సారమూ వ్యాఖ్యానిస్తున్నాడు. శాస్త్రి వ్యాఖ్యానిస్తుంటే పోతరాజు మనస్సులో శాస్త్రమంతా వేణునాదం లాగా మధురమధురంగా అనుభవంలోకి వస్తున్నట్టు తోచింది. ఆ అనుభవంలో ద్వైతాద్వైత భేదాలు కరిగి పోతున్నవి. శివనామ కృష్ణాది రూపభేదాలు తొలగి పోతున్నవి. అంతా అఖండ సచ్చిదానంద సాగరం—అదే క్షీరసాగరం అక్కడే అనంతుడు. ఆయనే సంకర్షణుడు. అక్కడే చతుర్భుజుడైన వాసుదేవుడు ఆయనలో నుండే ప్రద్యుమ్న అనిరుద్ధులు.

ఈ వ్యూహమంతా పోతన్న కళ్ళ ముందు సాక్షాత్కరిస్తున్నది. 'నమో భగవతే తుభ్యం వాసుదేవాయ ధీమహి, ప్రద్యుమ్నాయానిరుద్ధాయ నమస్సంకర్షణాయచ' అన్న భాగవత శ్లోకానుభవం ఇదేనేమో! తన్ను తాను మరచిన పోతరాజు కళ్ళలోనుండి నిరంతరాశ్రు ధారలు వెలువడుతూ ఉన్నవి.

రాజన్నశాస్త్రి పోతరాజు వైపు చూశాడు. రోజూ తన ప్రవచన వేళలో ఎందరో వచ్చి వెళ్ళుతుంటారు. తనకు గుర్తే ఉండదు. ఈయన ఎవరో అలౌకిక వ్యక్తి లాగా ఉన్నాడు. తాను చేసే సాధన ఈయన రూపంలో సిద్ధించిందేమో అనిపించింది.

పోతరాజు శాస్త్రికి పాదాభివందనం చేశాడు. ఆయన స్థితి తనశక్తి నంతా శ్రీరాముడికి ధారపోసిన పరశు రాముడిలా ఉన్నది. శాస్త్రికి పోతరాజు ధ్రువుడో, ప్రహ్లాదుడో, శ్రీ శుకుడో ఇలా రూపొందినారా అనిపించింది. పోతరాజు శాస్త్రి దగ్గర సెలవు తీసుకుంటూ ఉండగా మనస్సులో 'లలిత స్కంధము కృష్ణమూలము' అన్న పద్యం స్ఫురించింది.

రాత్రికి చంద్రగ్రహణము సాయంకాలం నుంచే జనం గోదావరి దగ్గరకు చేరుతున్నారు. జాము రాత్రికి ప్రారంభమయ్యే గ్రహణం ఏడు గడియల కాలం ఉంటుంది. చాలా మంది దూర ప్రాంతాల నుంచి వచ్చారు. కొందరు గ్రహణకాలంలో మంత్రోపదేశం కోసం గురువులను ఆశ్రయిస్తున్నారు.

రాత్రి అయిదు గడియలు దాటించి వెన్నెలలో గోదావరి అభిషిక్తురాలౌతున్నది. నదీ గర్భంలో అక్కడక్కడా తేలుతున్న బండరాళ్ళ మీద చంద్ర కిరణాలు ప్రకాశించి వాటిని చంద్రకాంత శిలలుగా కనిపింప చేస్తున్నవి.

గ్రహణానికి ముందే ప్రజలు స్నానాలు చేస్తున్నారు. కొందరు దూరంగా కూర్చుని తమ తమ అనుష్ఠానాలు చేసుకుంటున్నారు.

ఆ రోజు పోతరాజు, బాలరుక్మిణి స్నానాలు ముగించారు. బాల రుక్మిణి భర్త కెదురుగా కూర్చున్నది. ఆమె మనస్సులో దివ్య లోకాలు పరిక్రమిస్తున్నవి. పోతరాజుకనులు మూసి మహేశ్వర ధ్యానంలో నిమగ్నుడైనాడు. క్రమంగా ఆయన మనస్సులో పంచాక్షరి మోగుతున్నది. హృదయ స్థానంలో ఏదో కదలిక. క్రమంగా నిశ్శబ్ద స్థితి. ఆ స్థితిలో ఆయనలో నారాయణాష్టాక్షరి మేల్కొన్నది. మళ్ళీ హృదయాకాశంలో కదలిక—నిశ్శబ్ద స్థితి.

ఆ నిశ్శబ్ద స్థితిలో విశ్వమంతా పరిభ్రమిస్తున్నది. సర్వ జగత్తూ, సర్వ విద్యలూ, సర్వ చైతన్యమూ నానా వర్ణాలుగా సాగి సాగి చివరకు నీలవర్ణంగా లయం పొందింది. ఆ నీల వర్ణము నెమలి మెడకింది నీలవర్ణం లాగా ఉంది. దానిలో ఒక సువర్ణ మయ రోచిస్సు ప్రకాశిస్తున్నది.

క్రమంగా మూసిన కళ్ళు కొంచెం కొంచెం విప్పుకుంటున్నవి. ఎదురుగా పద్మాసనంలో కూర్చున్న బాలరుక్మిణి ఆయనకు కనిపించ లేదు. గోదావరి కనిపించలేదు. ఆకాశం అంతా చుట్టూ ఆవరించినట్టుగా ఉంది. సుందర నీలాకాశం క్రమంగా ఎదురుగా రూపు కట్టుకుంటున్నది, ఒక మబ్బు దిగి వచ్చినట్టుగా.

నీలవర్ణంలోని బంగారు మెరుపు పక్కనే ఇంకో రూపం కట్టుకుంటున్నది. ఆ రెండు వర్ణాలూ శివనారాయణ మంత్రమూర్తుల కలయికగా గోచరించాయి. ముఖాన చిరునవ్వు, మూపున విల్లు, శిరసున కిరీటము, పక్కన జగన్మాత—ఆ దృశ్యం ఇంతకు ముందు తనకు స్వప్నాలలో కాన వచ్చిన మూర్తులలో ఏదీ కాదు. చిరునవ్వు చంద్రకళ లాగా, విల్లు సర్పం లాగా, కిరీటం జటాజూటం లాగా కానవచ్చాయి. ఎవరైనా మహా పురుషుడో, మహారాజా, సాధువో గ్రహణ స్నానానికి వచ్చిన వాడా? పోతరాజుకు ధ్యాన భంగం అయింది. చకితుడై తేరి పార జూస్తున్నాడు. ఈ రాజశేఖరుడు ఎవ్వరా అని అనుకుంటున్నాడు.

ఎదురుగా నిలిచి ఉన్న మహాపురుషుడు మాట్లాడినట్లు అనిపించింది. 'ఎను రామభద్రుండ మన్నామాంకితంబుగా భాగవతంబు తెలుంగు సేయుము, నీకు భవబంధంబులు తెగు' అని వినిపించింది.

స్వామి శ్రీరామచంద్రుడా? పక్కన ఉన్న తల్లి జానకీదేవియా? ఇలా అనుకుంటూ ఉండగానే క్రమంగా మూర్తి దృశ్యం చెదిరిపోయి నీలవర్ణమే వ్యాపించి ఉంది. నీల వర్ణం క్రమంగా చెదిరింది. ఎదురుగా బాలరుక్మిణి, పక్కన గోదావరి, తాను కూర్చున్న ఇసుక తిన్నె, ఎదురుగా లక్ష్మీ నృసింహస్వామి ఆలయ గోపురమూ...

పోతరాజు లేచి చూస్తే గ్రహణం పూర్తిగా విచ్చింది. కొందరు అప్పుడే స్నానాలు చేస్తున్నారు. పోతరాజును చూచి బాలరుక్మిణి లేచింది. పోతరాజు ఆమెతో 'స్వామి అనుజ్ఞ అయింది భాగవత రచనకు' అన్నాడు.

ఆమె నవ్వుతూ "నేనే కదా మీ ఎదురుగా ఉన్నది—స్వామి ఎప్పుడు వచ్చాడు" అన్నది.

"శివుడో, రాముడో ఆయన! తల్లితో పాటు దర్శన మిచ్చి భాగవతం తెలుగు చేయి. నీకు మోక్షం కలుగుతుంది అన్నాడు."

"నా కేమో మీ కనుబొమల నడుమ ఒక జ్యోతి ప్రకాశించినట్లు అనిపించింది.'

"మనం అదృష్టవంతులమే. కాని స్వామి కార్యమంటే సామాన్యమా! ఏదో కార్య కలాపం కాదు కదా! నా పాండిత్య మెంత! నా శక్తి ఎంత! 'భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు శూలికైన తమ్మి చూలికైన!'

"ఈ కర్తృత్వ భారం మీకెందుకు! స్వామి ఒకానొక కార్యానికి ఉపకరణంగా మిమ్మల్ని ఎన్నుకున్నారు. మీరు సర్వ సమర్పణ చేస్తే ఆయనే చూచుకుంటాడు. భాగవతాన్ని ఆయనే పలికిస్తాడు!"

"అంతే, బాల రుక్మిణీ!" అన్నాడు పోతన.

యువకవి అర్ధనిమీలిత నేత్రుడైనాడు. ఆయన నోటి వెంట పద్య ధార మొదలైంది.

'పలికెడిది భాగవతమట, పలికించెడి వాడు రామభద్రుండట. . .'

బాలరుక్మిణి శరీరం పులకించింది. ఆ పులకరింత నుంచి చిరునవ్వు విరిసింది. ఆ చిరునవ్వులో తెలుగు కావ్యలోకం లోకి రసదేవత అవతరించినట్లు భాసించింది. ★